

సీఐ ఎస్వీ శేఖర్‌కి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

లడ్డూ కల్తీదారులపై చర్యలు తీసుకోండి

బోరబండ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థాన లడ్డూ ప్రసాదం కల్తీకి కారకులైన టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మాజీ సీఈవో ధర్మారెడ్డితో పాటు ప్రసాదానికి గంధం, నెయ్యి సరఫరా చేసిన ఏఆర్ డైరీ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు బోరబండ సీఐ ఎస్వీ శేఖర్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. హిందు సనాతన ధర్మాని కాపాడాల్సిన టీటీడీ బోర్డు అధికారులు కమీషన్‌లకు అలవాటు పడి హిందువుల మనోభావాలు దెబ్బతినేలా కల్తీకి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ నాయకులు రాజ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, మహేష్, చంద్రశేఖర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న యాదవ ఐక్య వేదిక నాయకులు

యాదవులను విస్మరిస్తున్న ప్రభుత్వం

పంజాగుట్ట, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన యాదవ సామాజిక వర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి విస్మరిస్తున్నారని యాదవ ఐక్య వేదిక ఆరోపించింది. జనాభా ప్రాతిపదికన రాష్ట్ర మంత్రివర్గంలో, నామినేటెడ్ పదవుల్లో ఎమ్మెల్సీలుగా ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షుడు ఎల్లావుల చక్రధర్ యాదవ్ డిమాండ్ చేశారు.శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వేదిక నాయకులు బి.శంకర్ యాదవ్,బి. శ్రీనివాస్ యాదవ్, బి.మహేష్ యాదవ్, ఎం.శ్రీశైలం యాదవ్, తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర జనాభా 55 లక్షలకు పైగా ఉన్న తమ సామాజిక వర్గాన్ని కాంగ్రెస్ పార్టీ విస్మరిస్తుందని, ఏపీ, గత ప్రభుత్వాలలో యాదవులకు మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించారని అన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా తమ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో చోటు కల్పించే వారని గుర్తు చేశారు. స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం తమకు సీట్లు కేటాయించాలని అన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ పథకాన్ని వెంటనే చేపట్టి లబ్ధిదారుల ఖాతలోనే నిధులు జమ చేయాలని అన్నారు. రాజకీయ పార్టీలు తమను చిన్నచూపు చూడవద్దని, తమ మనోభావాలు కాపాడాల్సిన బాధ్యత వారిపై ఉందని అన్నారు. సమావేశంలో వేదిక నాయకులు జె. రాజు యాదవ్, బి.ప్రవీణ్ యాదవ్, గోవర్ధన్ యాదవ్, మధుసూదన్ యాదవ్, వెంకటేష్ యాదవ్, ఏకనాథ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో వైద్య శిబిరానికి విశేష స్పందన

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లో మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాల్టీ ఆస్పత్రి ఆధ్వర్యంలో గాంధీనగర్ మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన వచ్చింది. ఈ శిబిరంలో 2 వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు, అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు లక్ష్మీనాథ్, నాయకులు ఎల్లయ్య, రాములు, తిమ్మయ్య, శ్రీధర్, వెంకటసాయి, వైద్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

షాపూర్‌నగర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): సూరారం డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌లో నూతనంగా నిర్మాణం చేపడుతున్న సీసీరోడ్డు పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సహకారంతో ముందుకు పోతున్నామని తెలిపారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను కాలనీలు, బస్తీవాసులు తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

షాపూర్‌నగర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ లో భాగంగా జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ దగ్గర నుంచి షాపూర్‌నగర్ సాగర్‌హోటల్ వరకు రోడ్డు ఆక్రమణలో ఉన్నవ్యాపార సముదాయాలు, డబ్బాలను జీహెచ్ఎంసీ అధికారుల పోలీసులు ఆధ్వర్యంలో శనివారం ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. ఈ తొలగింపులో రోడ్డు పక్కన ఉన్న చిరువ్యాపారులు, నిరాశ్రయులయ్యారు. తమకు న్యాయం చేయాలని వ్యాపారులు అధికారులను కోరుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.2 లక్షల సాయం

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): వసంతనగర్‌లోని సెయింట్ మేరీస్ స్కూల్ తరఫున వరదసాయం కోసం రూ.2 లక్షలు సీఎంఆర్‌ఎఫ్‌కు అందజేసినట్లు కరస్పాండెంట్ క్రిష్ణవేణి తెలిపారు. తమవంతు సామాజిక బాధ్యతగా విద్యార్థులు, ఉపాధ్యాయులు విరాళాలు ఇవ్వడాన్ని ఆమె అభినందించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు అందరూ ఎంతో కొంత భాగస్వామ్యంతో వారికి కొంత ఊరట లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచే తోటి వారికి సహాయం చేయాలన్న ఆలోచనలు రావడం, ఆచరణలో పెట్టడం తమ స్కూల్లో నేర్పిస్తామన్నారు.

ఓటరు నమోదుపై నిర్లక్ష్యం వద్దు

చందానగర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయొద్దని, నిర్లక్ష్యం వహించిన వారి విషయంలో కఠిన చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్ చెన్నయ్య అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఓటరు నమోదులో మార్పు, చేర్పులు తదితర అంశాలపై జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశమయ్యారు. ఓటరు లిస్టు నమోదుపై నిర్లక్ష్యం చేయొద్దని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి, ఏఎంహెచ్ఓ విజయ్‌కుమార్, కార్తీక్, కృష్ణ ఉన్నారు.

చెల్లని చెక్కు ఇచ్చి నగలు తీసుకున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు ఇచ్చి విలువైన ఆభరణాలు తీసుకొని ముఖం చాటేసిన వ్యక్తిపై కేసు నమోదయింది. జూబ్లీహిల్స్‌కు చెందిన మంగత్రాయ జువెలరీకి సుమన్ గుంటి అనే వ్యక్తి వచ్చాడు. బంగారు గొలుసులు కావాలని చెప్పాడు. రూ.4,12 లక్షల చెక్కు ఇచ్చాడు. జూన్ 20న అర్డర్ ఇచ్చిన బంగారు నగలు డెలివరీ చేసిన షోరూం నిర్వాహకులు అదే రోజు చెక్కును బ్యాంకులో వేశారు. రెండు రోజుల తరువాత బ్యాంకు ఖాతా స్తంభించిందని సమాచారం వచ్చింది. వెంటను సుమన్ గుంటికి ఫోన్ చేసేందుకు ప్రయత్నించగా అది పనిచేయలేదు. మోసపోయినట్టు గ్రహించిన షోరూం నిర్వాహకుడు అజయ్‌గుప్తా జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఇటీవల మరణించిన సీపీఐ నేత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ దళిత విభాగం నేత కాటూరి రమేష్, బబ్లూ, మచ్చల విష్ణు, గుంజ ఆంజనేయులు తదితరులు

-బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

అధ్వానంగా బీజేజేఆర్‌నగర్ శ్మశాన వాటిక



పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలతో అల్లుకుపోయిన లోపలి భాగం

- పనిచేయని పవర్ బోర్
- నీళ్లు లేక ప్రజల అవస్థలు
- స్నానాల గదులకు వెళ్లే దారిలో ముళ్ల చెట్లు

అమీర్‌పేట, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మానవుని చివరి మజిలీ అయిన శ్మశాన వాటికలను వైకుంఠ ధామాలుగా తీర్చి దిద్దాలన్న గత ప్రభుత్వ లక్ష్యం నిర్వాహణ లోపంతో నీరు గారింది. 8 సంవత్సరాల క్రితం స్థానికుల అభ్యర్థన మేరకు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బల్కంపేట బీజేజేఆర్ నగర్‌లో రూ. 38 లక్షలు విడుదల చేయించి స్నానాల గదులు, విశ్రాంతి గదులు, అస్థికలు భద్రపరిచే గది, 5 శవదహన పేటికలు, పాత్‌వే, రకరకాల పూల మొక్కలు, పచ్చని గ్రీనరి ఏర్పాటు చేయించి అబ్బురపరిచే విధంగా వైకుంఠ ధామంగా తీర్చిదిద్దించారు. దాహన సంస్కారాల అనంతరం ఏలాంటి నీటి కొరత లేకుండా పవర్ బోర్ కూడా వేయించారు. కాగా నిర్వహన లోపం కారణంగా ప్రస్తుతం అధ్వానంగా తయారైంది. ఎటు చూసిన ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో అల్లుకుపోయి నడవడానికి వీలు లేకుండా తయారైంది. స్నానాల గదుల ముందు పెరిగిన ముళ్ల పొదలు వీటిని కనిపించకుండా చేస్తున్నాయి.

అస్థికలు భద్రపరిచే గది తలుపు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకు పోవయారు. దీని ముందే స్థానికులు మలమూత్ర విసర్జనలు చేస్తు పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారు. పవర్ బోర్ పాడవడంతో స్నానాలు చేయాలంటే ప్రైవేట్ నీటి ట్యాంకర్ తొప్పించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. నడక కోసం శ్మశాన వాటికలో ఏర్పాటు చేసిన పాత్‌వేపై తుమ్మలు మొలిచాయి. పూల మొక్కలు, పచ్చని గ్రీనరీతో కలకలలాడిన వైకుంఠ ధామం సదుపాయాలు, నిర్వాహణ లోపంతో అధ్వానంగా మారింది.



స్నానాల గదికి వెళ్లే దారిలో పిచ్చి మొక్కలు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

లక్షలు వెచ్చించి నిర్మించిన బీజేజేఆర్ నగర్ శ్మశాన వాటిక కేర్ టేకర్ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. రాత్రి అయిందంటే కొంత మంది యువకులు ఇందులోకి వచ్చి మద్యం, గంజాయి లాంటి మత్తు పదార్థాలను వాడుతున్నారు. ప్రవేశ ద్వారం ముందు ఏర్పాటు చేసిన ఇనుప గేటుకు తాళలు లేకపోవడంతో ఆకతాయిలకు శ్మశాన వాటక అడ్డాగా మారింది.

కేర్ టేకర్‌ను నియామించాలి..



గత ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ శ్మశాన వాటిక నిర్వాహణ లోపంతో అధ్వానంగా తయారైంది. ప్రవేశ ద్వారానిక తాళలు లేకపోవడంతో కొంత మంది నిత్యం పేకాట ఆడడం, మద్యం సేవిస్తూ అల్లర్లకు కారకులు అవుతున్నారు. రాత్రి వేళ ఈ ప్రాంతంలో పోలీస్ పెట్రోలింగ్‌ను పెంచాలి.

- తాళ్ల రవీందర్ గౌడ్, విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్, బల్కంపేట

నీటి సదుపాయం కల్పించాలి



పవర్ బోర్ పనిచేయకపోవడంతో దహన సంస్కారాల అనంతరం స్నానాలు చేసేందుకు ఇబ్బందులు పడాల్సివస్తోంది. స్నానాల గదుల ముందు ముళ్లపొదలు దట్టంగా పెరిగి పోయాయి. అస్థికలు భద్రపరిచే గది ముందు చేస్తున్న మలమూత్ర విసర్జన చేస్తున్నారు. ఎమ్మెల్యే పట్టించుకుని నీటి సౌకర్యం కల్పించాలి.

-రామేశ్వరం ధశరథ్, స్థానికుడు

అంబేడ్కర్‌నగర్‌లో అక్రమ నిర్మాణాలు

- కూల్చివేసిన రెవెన్యూ సిబ్బంది
- మరికొన్ని కబ్జాలపై స్థానికుల ఫిర్యాదు



షేక్‌పేటలో కూల్చివేసిన అక్రమ నిర్మాణం

బంజారాహిల్స్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): లక్షల విలువ చేసే ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురయింది. రాజకీయ పార్టీకి చెందిన ఓ మహిళ మొదట గుడిసె వేసుకొని దాని ముసుగులో ఏకంగా పక్కా నిర్మాణాలు చేపట్టింది. సమాచారం అందుకున్న షేక్‌పేట రెవెన్యూ అధికారులు కూల్చి వేతలు చేపట్టారు. నిర్మాణాలను పూర్తిగా తొలగించారు. జూబ్లీహిల్స్‌లోని పద్మాలయ అంబేడ్కర్‌నగర్ బస్తీకి ఆనుకొని ప్రభుత్వ స్థలం ఉంది. దీన్ని స్థానికులు ఆక్రమించుకునేందుకు పలుమార్లు విఫలయత్నం చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన మహిళా నేత కన్ను దీనిపై పడింది. అసెంబ్లీ ఎన్నికల ముందే సుమారు వంద గజాల స్థలంలో గుడిసె వేసింది. కోతి పరిధిలో ఉన్న ఓ విద్యుత్ మీటర్‌ను ఇక్కడకు మార్చింది. తరువాత పక్కా నిర్మాణం మొదలు పెట్టింది. స్థానికుల ఫిర్యాదు మేరకు గతంలో ఆంధ్రజ్యోతి పలు మార్లు ఈ కథనాలు ప్రచురించింది. తాజాగా ఫిర్యాదులపై స్పందించిన రెవెన్యూ సిబ్బంది శనివారం కూల్చివేశారు. నిర్మాణాలును పునాదుల నుంచి తొలగించారు. బస్తీలో మరో రెండు ఆక్రమణలు కూడా ఉన్నాయని బస్తీ వాసులు ఫిర్యాదు చేశారు.

బస్తీకి చెందిన ఓ నాయకుడు 140 గజాల స్థలంలో బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టాడు. వాస్తవానికి ఆయనకు ఉంది కేవలం వంద గజాలు అయితే తన పరపతితో మరో 40 గజాలు ఆక్రమించుకున్నాడు. ఇందులో రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని సైతం తొలగించి బహుళ అంతస్తుల భవనం నిర్మాణం పూర్తి చేశాడు.

దీనిపై కూడా ఫిర్యాదులు అందడంతో రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. తన వద్ద ఉన్న పత్రాలు తీసుకరావాలని బస్తీ నేతను అధికారులు ఆదేశించారు.

క్రషర్ల అనుమతులను రద్దు చేసి.. మా ఊర్లను కాపాడండి

- ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసిన ప్రజలు



సీఎం నివాసం వద్ద ఐదు గ్రామాలకు చెందిన ప్రజలు

బంజారాహిల్స్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం సోలక్‌పల్లి రెవెన్యూ పరిధిలోని రాళ్లకత్వ గ్రామ పరిధిలో ఉన్న కంకర క్వారీ క్రషర్‌లను వెంటనే తొలగించి తమ గ్రామాలను రక్షించాలని పలు గ్రామాలకు చెందిన ప్రజలు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం వద్దకు వచ్చారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులకు అందించారు. అనంతరం రాళ్లకత్వకు చెందిన ఆది రామకృష్ణ, జింక రవీందర్, రాయిని శ్రీనివాస్, సాయి గౌడ్, పొట్ట శ్రీధర్, బయ్యన్న మహేష్, ఆది బాలరాజు, శివనగర్‌కు చెందిన సర్వర్ మహమ్మద్ అమీర్ హుస్సేన్ తదితరులంతా కలిసి మాట్లాడుతూ రాళ్లకత్వ గ్రామంలోని సర్వే నం. 286లో ప్రభుత్వం ద్వారా ఇటీవల కొందరు తప్పుడు పత్రాలతో కంకర క్వారీ క్రషర్లకు అనుమతులు పొందారన్నారు. చెరువు, పంటలు, చెక్‌డ్యామ్ ఉన్న ప్రాంతంలో ఈ క్రషర్‌లను ఏర్పాటు చేశారన్నారు. క్రషర్ ఏర్పాటు చేయవద్దని 70 శాతం మంది వ్యతిరేకించారని, అయినా అదేమి పట్టని అధికారులు ఇక్కడ అనుమతులు ఇచ్చారన్నారు. క్రషర్ ఏర్పాటు వల్ల చుట్టూ ఉన్న పది చెరువులు, 45 కుంటలు, దాదాపు 9వేల ఎకరాల పంటలు నాశనమవుతున్నాయని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గర్భిణులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నరన్నారు. తాము ఎదుర్కొంటున్న ఈ సమస్యలను జిల్లా కలెక్టర్, ఇరిగేషన్, ఈఈ, డీఈ అధికారులకు, ఆర్డీవో, తహసీల్దార్లకు ఇప్పటికే ఫిర్యాదు చేశామన్నారు. క్రషర్ వల్ల రాళ్లకత్వ, ఊట్ల, శివనగర్, సోలక్‌పల్లి, జిన్నారం గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కాగా విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు స్పష్టం చేశారు.

జన్యు, పర్యావరణ, జీవనశైలి కారణాలతో మతిమరుపు



ప్రపంచ మతిమరుపు వ్యాధి దినోత్సవ కరపత్రాన్ని విడుదల చేస్తున్న వైద్యులు

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మతిమరుపు (అల్జీమర్స్) వ్యాధి అనేది ముఖ్యంగా జన్యు, పర్యావరణ, జీవనశైలి కారణాలవల్ల కలుగుతుందని, దీనివల్ల మెదడు కణజాలాన్ని కోల్పోవడం కాకుండా కణాల మధ్య పనితీరు కమ్యూనికేషన్ కోల్పోయేలా చేస్తుందని టీఎస్‌టీ మెంటల్ హెల్త్ అవేర్నెస్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ జార్జిరెడ్డి అన్నారు. శనివారం ప్రపంచ మతిమరుపు దినోత్సవం సందర్భంగా ఎర్రగడ్డలోని మానసిక ఆస్పత్రిలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ గణాంకాల ప్రకారం ప్రతి సంవత్సరం మతిమరుపు వ్యాధితో లక్షకు పైగా మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. అయినప్పటికీ మతిమరుపు అసోసియేషన్ ప్రకారం 65 సంవత్సరాలు అంతకంటే ఎక్కువ వయసు ఉన్న వారిలో అల్జీమర్స్ వ్యాధి మరణానికి ఐదో ప్రధాన కారణమని తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కూడా మతిమరుపు, మధుమేహం, బీపీ, వ్యాధులు పెరుగుతున్నాయని దీనికి అధికంగా మత్తు పదార్థాలు వాడడం కారణమన్నారు. ఈ సందర్భంగా మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.అనిత మాట్లాడుతూ మతిమరుపు వ్యాధి అనేది మానసిక రోగుల్లోనే కాకుండా సాధారణ వ్యక్తుల్లో కూడా సంభవిస్తుందన్నారు. ఈ మతిమరుపు వ్యాధికి మందులు ఉన్నాయని, వాటికన్నా దైనందిన జీవిత విధానంలో మార్పులు చాలా ఫలితాన్ని ఇస్తాయన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ గిరిప్రసాద్ మాట్లాడుతూ మతిమరుపు రాకుండా ఉండడానికి ఎక్కువగా చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. మెదడుకు పనికల్పించే పనులు చేయాలని, కొత్తరకం వంటలు ప్రయత్నించడం, చిన్నపిల్లలను పెంచడం లాంటివి చేస్తే బ్రెయిన్ చాలా ఉత్తేజమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీలలో గెలుపొందిన వైద్య విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు.



సదస్సులో పాల్గొన్న వైద్య విద్యార్థులు

ఈ కార్యక్రమంలో మానసిక ఆసుపత్రి సైకాలజీ విభాగం అధిపతి డాక్టర్ సుధా, మెడికల్ సైకాలజిస్టు వెంకటసుబ్బయ్య వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిలో మురుగు పరుగు



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్ ప్రజలు మురుగు సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారు. నూతనంగా బస్తీలు, కాలనీలు ఏర్పాటు కావడంతో అప్పటి జనాభాకు అనుగుణంగా వేసిన పైప్‌లైన్‌లు, మురుగునీటి పైప్‌లైన్‌లు ఇప్పటి జనాభా సామర్థ్యానికి సరిపోకపోవడంతో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో మురుగు రోడ్లపై పారుతుంది. షాపూర్ నగర్ నుంచి పేట్ బషీరాబాద్‌కు వెళ్లే పైప్‌లైన్ రోడ్డులో శ్వేత ఆర్యన్ అపార్టుమెంట్ ఎదురుగా మురుగు నీరు పొంగి కిలోమీటర్ల మేర పారుతుంది. అదే రోడ్డులో కోణార్క్ ఆస్పత్రి సమీపంలో పాదాచారులు నడిచే బాటలో మురుగునీరు చేరి తీవ్ర దుర్గదం వెదజల్లుతోంది. గతంలో ఈప్రాంతంలో సుభాష్‌నగర్ నాలా వరకు 4 వందల ఎంఎం డయా పైప్‌లైన్ వేశారు. ప్రస్తుత జనాభావసరాలకు ఆ పైప్‌లైన్ సరిపోవడం లేదు. ఈ దారిలో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారులు స్పందించి మురుగు నీటి పైప్‌లైన్ పనులను తొందరగా పూర్తి చెయ్యాలని సంబందిత అధి కారులను కోరుతున్నారు. ఈ విషయంపై జలమండలి డీజీఎం రాజేష్‌ను వివరణగా కోరగా పాత పైప్‌లైన్ మార్గంలో నూతన పైప్‌లైన్ వెయ్యాలి, ఆ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉన్నాయి. ఈ విషయం విద్యుత్ అధికారులకు స్తంభాలను తొలగించాలని లెటర్ ఇచ్చామని, త్వరలోనే మురుగు నీటిని కట్టడి చేస్తాం.

హారన్ కొట్టి కారు తీయమన్నందుకు కత్తితో దాడి

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): హారన్ కొట్టి కారు తీయమంటా వా అంటూ ఓ వ్యక్తి ఇద్దరు యువకులపై కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బల్కంపేట్ ప్రాంతంలో నివాసం ఉండే జగ్‌జ్యోత్‌సింగ్ తన స్నేహితులు పెట్టిన గణేశ్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు కూకట్‌పల్లికి వచ్చాడు. శనివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో రామయ్యనగర్‌లో కారు నిలిపి ఉండగా..వెనకాలే వచ్చిన అవినాష్, నవీన్ మరో కారులో హారన్ కొడుతూ వచ్చారు. ఎవరూ కారు తీయకపోవడంతో కారు దిగి వచ్చి ఏంటి? అర్థం కావడం లేదా అంటూ అరవడంతో ఇరువురు కొట్టుకున్నా రు. కోపోద్రిక్తుడైన జగ్‌జ్యోత్‌సింగ్ తన వద్ద ఉన్న కత్తితీసి వారిపై దాడి చేయడంతో వారిద్దరికీ గా యాలయ్యాయి. దీంతో బాధితుల ఫిర్యాదు మేర కు పోలీసులు జగ్‌జ్యోత్‌సింగ్‌ను అదుపులోకి తీసు కున్నారు. అతనిపై సెక్షన్ 307 కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించే పనిలో పోలీసులు ఉన్నారు. చిన్నపాటి గాయాలేకావడంతో రాందేవ్‌రావు హాస్పిటల్‌లో ఓపీ ద్వారా చికిత్స తీసుకుని ఇంటికి వెళ్లారని పోలీసులు తెలిపారు. హత్యాయత్నంగా పరిగణించి గతంలో ఏమనా కేసులు ఉన్నాయా అన్న కోణంలో విచారణ చేశారు.

దంపతుల ముసుగులో వ్యభిచారం

- జంట గుట్టురట్టు చేసిన పోలీసులు

అల్లాపూర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): ఫ్యామిలీ ముసుగు తొడిగి వ్యభిచారం నడిపిస్తున్న జంటని సైబరాబాద్ ఏహెచ్‌టీయూ (యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ య నిట్) రైడ్ చేసి పట్టుకున్న సంఘటన అల్లాపూర్ పోలీస్ స్టేషన్ లిమిట్స్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లో ఓ ఫ్లాట్‌లో అద్దెకు ఉంటున్న వంశీ కృష్ణ(29), పార్వతిలు కొంతకాలంగా దంపతులుగా చలామణి అవుతూ ఉన్నారు. పార్వతి వ్యభిచారం కేసులో చిక్కుకోవటంతో స్థానికంగా చర్చనీయాంశం అయింది. సైబరాబాద్ ఏహెచ్‌టీయూ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం ఇద్దరు గతంలో కూడా మాదాపూర్ ఇతర ప్రాంతాల్లో వేర్వేరు కేసులో పట్టుబడ్డారు. పార్వతి జైల్లో వేసినా వ్యభిచారం వదల్లేదని తెలిసింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీరైన వంశీ కృష్ణ అలియాస్ ప్రవీణ్ అలియాస్ నాని కూడా జల్సాలకు అలవాటు పడి తన నైపుణ్యంతో పాటు పార్వతి లాగిన్‌తో సోషల్ నెట్‌వర్కింగ్ ద్వారా విటులను ఆకర్షించేవాడు. కొత్త కస్టమర్స్‌ను ఆకర్షించేందుకు పాత వారచే తమ సర్వీసు బాగుందంటూ టెస్టిమోనిల్స్ కూడా టెలిగ్రాం, వాట్సాప్‌లలో రాయించుకునేవారు. శుక్రవారం జరిపిన రైడ్‌లో వీరిద్దరితో పాటు ఒక విటుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి రెండు ల్యాప్‌టాప్‌లు, 5 మొబైల్ ఫోన్లు, రూ.6,280 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై పిటా కేసు నమోదు చేశారు.



బంజారనగర్‌లో ఏఈతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ బాబా

బస్తీలో కార్పొరేటర్ పర్యటన

బోరబండ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో సమస్యలను స్థానికుల నుంచి తెలుసుకొని పరిష్కారించడానికే అధికారులతో కలసి బస్తీల్లో పర్యటిస్తున్నామని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని బంజారనగర్‌లో జీహెచ్ఎంసీ ఏఈ భరత్‌తో కలిసి పర్యటించారు. మ్యాన్‌హోల్ మరమ్మతులు, రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చలాన్నారు. కార్పొరేటర్ వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

బౌద్ధనగర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలో శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం, రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మహ్మద్‌గూడ నాలా వద్ద, ఆర్ట్‌కాలేజీ అండర్‌పాస్‌లో భారీగా వర్షపు నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయంలో గర్భగుడిలోకి వాన నీరు చేరింది. దీంతో చైర్మన్ గుంటి కృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీనివాసనగర్, బ్రాహ్మణబస్తీ, ఎల్.నారాయణనగర్, పుల్లయ్యబావి, న్యూఅశోక్‌నగర్ తదితర లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరు చేరటంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయటంతో బస్తీవాసులు ఇబ్బందులు పడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శనివారం బౌద్ధనగర్ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఎల్.నారాయణనగర్‌లో వరద ప్రభావ ప్రాంతాలను సందర్శించి స్థానికులను వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి ముంపు ప్రాంతాల్లో దోమల మందుతో పాటు బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌గుప్తా, పార్వతమ్మ, బాలయ్య, సంజయ్‌కుమార్, లింగం పాల్గొన్నారు.


ఎల్.నారాయణనగర్‌లో నిలిచిన వర్షపునీటిని పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్రకార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్


మహ్మద్‌గూడ నాలా వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు


నామాలగుండులో కేపీఎన్ ఫ్రెష్ సూపర్‌మార్కెట్‌ను ప్రారంభిస్తున్న భవన నిర్మాణ కార్మికసంఘం అధ్యక్షుడు కుంచాల ఏడుకొండలు

నామాలగుండులో కేపీఎన్ ఫ్రెష్ సూపర్ మార్కెట్ ప్రారంభం

బౌద్ధనగర్, సెప్టెంబర్21(ఆంధ్రజ్యోతి): వారాసిగూడ నామాలగుండులో సెవెన్ హిల్స్ వేదాంత్ ఎస్టేట్ భవనంలో శనివారం కేపీఎన్ ఫ్రెష్ సూపర్‌మార్కెట్‌ను భవన నిర్మాణ కార్మికసంఘం అధ్యక్షుడు, సెవెన్‌హిల్స్ బిల్డర్స్ అధినేత కుంచాల ఏడుకొండలు ప్రారంభించారు. నగరంలో కేపీఎన్ ఫ్రెష్ 9వ బ్రాంచ్‌ను నామాలగుండులో ప్రారంభించామని, నెలాఖరుకు మరో 16 బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జిలు మహేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.


నెహ్రూనగర్‌లో బీజేపీ సభ్యత్వ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దీపిక

బీజేపీని మరింత బలోపేతం చేయాలి

మారేడుపల్లి, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లి బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక పిలుపునిచ్చారు. శనివారం డివిజన్ పరిధిలోని మారేడుపల్లి నెహ్రూనగర్ పరిసర ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. ఫోన్ నం. 8800002024కు మిస్డ్‌కాల్ లేదా.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం లేదా నమో యాప్ ద్వారా బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని మారేడుపల్లిలోని వాకర్స్, సీనియర్ సిటిజన్స్‌కు సూచించారు.

మూత్రశాలల తొలగింపు హర్షణీయం

● కాంగ్రెస్ నాయకుడు త్రికాల మనోజ్ కుమార్



రాంగోపాల్‌పేట్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాలుగా ప్రఖ్యాత సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయానికి వచ్చే భక్తులు, స్థానిక ప్రజలకు అసౌకర్యంగా ఉన్న మూత్రశాలను తొలగించడం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్ అన్నారు. శనివా రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ ప్రత్యేక చొరవ తీసుకొని జీహెచ్‌ఎంసీ అధికారులను ఒప్పించి వాటిని తొలగించారన్నారు. ఈ సందర్భంగా కోట నీలమతో పాటు జీహెచ్‌ఎంసీ అధికారులకు త్రికాల మనోజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆలయం పక్కనే ఉన్న మూత్రశాలలను తొలగించడం వల్ల భక్తులతో పాటు ఇక్కడి నుంచి రాకపోకలు సాగించే నాఖాబజార్ బస్తీ వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఇక్కడి బట్టల బజార్‌కు వచ్చే వినియో గదారులు, పని చేసే సిబ్బందికి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయంగా మూత్రశాలలను మరోచోట ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు.

వెంకటేశ్వర స్వామికి కవచం బహూకరణ

సికింద్రాబాద్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లో ప్రసిద్ధి చెందిన బోయినపల్లి న్యూసిటీ కాలనీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువై ఉన్న గరుడ ఆళ్వార్ విగ్రహానికి భక్తులు శ్రీనివాస్, వీరమణి, ప్రీతిరెడ్డి కవచంను బహూకరించారు. ఈ సందర్భం గా ఆలయ ట్రస్ట్ సలహాదారు జంపన ప్రతాప్ ఆధ్వర్యంలో ఆలయ కమిటి సభ్యులతో కలిసి కవచం అందజేసిన భక్తులతో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వారిని శాలువాతో సత్కారించారు. ఆలయానికి సహాయసహకారాలు అందించాలకునే దాతలు ఆలయకమిటీని సంప్రదించాలని ప్రతాప్ కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జగన్నాథం, యాదయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

కుషాయిగూడ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకోవడం ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం కలుగుతోందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి వి.బాల భాస్కర్ పేర్కొన్నారు. శనివారం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో 28న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. రాజీ చేసుకోదగ్గ రోడ్డు ప్రమాదాలు, ఆస్తి వివాదాలు, చెక్కుబౌన్స్, సివిల్ కేసుల్లో రాజీపడడం ద్వారా ఇరువర్గాలకు న్యాయం జరిగే అవకాశం ఉందని ఆయన వివరించారు. కాగా, లోక్‌అదాలత్‌లపై అవగాహన కల్పించేందుకు పోలీస్ స్టేషన్‌లలో ఈ పోస్టర్‌లను ప్రదర్శించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

తిరుమలగిరి సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ట్రాఫిక్ నార్త్ జోన్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో రాంగ్ డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తులకు కౌన్సెలింగ్ చేశారు. ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని విధిగా హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనం నడపరాదని వారికి సూచించారు. ఐదు నిమిషాలు ఓపిక పట్టి గ్రీన్‌సిగ్నల్ రాగానే వెళ్లాలని, కొద్ది దూరమే కదా అని రాంగ్ రూట్‌లో వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దని, యూటర్న్ వరకు వెళ్లి వాహనాలను మలుపు తిప్పాలని అన్నారు. ప్రమాదాలు నివారించడం, ప్రమాదాలు జరగకుండా వాహనాలను నడపడం వాహనదారులపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేసిన సుమారు 100 మందితో పెండింగ్ చలాన్లను కట్టించారు. పొల్యూషన్ నుంచి రక్షణ కోసం ట్రాఫిక్ పోలీసులకు మాస్కులను పంపిణీ చేశారు. ఇన్‌స్పెక్టర్ మధుబాబు, ఎస్సై శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేసిన యువతకు కౌన్సెలింగ్ చేస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు



భారతీయ నారీ ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న అగర్వాల్ సమాజ్ మహిళలు

ఘనంగా భారతీయ నారీ ఉత్సవ్

బోయినపల్లి, సెప్టెంబర్21 (ఆంధ్రజ్యోతి): అగర్వాల్ సమాజ్ గురువు అగర్వాల్ జయంతి సందర్భంగా శనివారం సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్‌లో భారతీయ నారీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్లు మంజుషా, స్వర్ణలతలు పాల్గొని అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు మనీష్ అగర్వాల్‌తో కలిసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలందరూ వివిధ రకాల ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో భాగంగా మహిళల కోసం ప్రత్యేకమైన స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పురుషోత్తమ్ అగర్వాల్, కపూర్‌చాంద్ గుప్తా, కంచన్ అగర్వాల్, అంజనీకుమార్ అగర్వాల్, పూజాగుప్తా, రీతు అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.


ఉచిత దంత వైద్యశిబిరంలో పాల్గొన్న జంపన ప్రతాప్

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం: జంపన

సికింద్రాబాద్, సెప్టెంబర్21(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ తెలంగాణ ఆధ్వర్యంలో శనివారం న్యూబోయినపల్లి బాపూజీనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై దంత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ తెలంగాణ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. పేద విద్యార్థులకు లయన్స్‌క్లబ్ భవిష్యత్‌లో ఇతర వైద్యపరీక్షలు కూడా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సూరంపల్లి సురేష్‌రావు, కార్యదర్శి బి.లక్ష్మణ్, కోశాధికారి తుమ్మల నాగేందర్, ఆశీర్వాదం, నారాయణ, ఆరోగ్యం, యాదయ్య పాల్గొన్నారు.

డీమ్డ్ యూనివర్సిటీ అనుమతులను రద్దు చేయాలి

తార్నాక, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభ ఉన్న పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసేలా ప్రైవేట్ మెడికల్, డెంటల్ కాలేజీలకు ఇచ్చిన డీమ్డ్ యూనివర్సిటీ అనుమతులను వెంటనే రద్దు చేయాలని బీసీ విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ కోరారు. ఈ మేరకు ఆయన శనివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వర్గాల ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీనిఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొల్లెపల్లి స్వామిగౌడ్ మాట్లాడుతూ, మెడికల్, డెంటల్ కాలేజీలకు కేంద్ర ప్రభుత్వం డీమ్డ్ యూనివర్సిటీల హోదాను ఇవ్వడం వల్ల కళాశాలల యాజమాన్యాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రిజర్వేషన్లు అమలు చేయకుండా ఇష్టారాజ్యంగా మెడికల్ సీట్లను అమ్ముకుంటున్నాయన్నారు. దాంతో సమాజంలో వెనుకబాటుతనానికి గురైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. బడుగు బలహీనవర్గాల విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం డీమ్డ్ వర్సిటీల అనుమతులను రద్దు చేయడంతో పాటు, భవిష్యత్‌లో డీమ్డ్ వర్సిటీలకు అనుమతులు ఇవ్వవద్దని కోరామన్నారు. తమ వినతికి షబ్బీర్ అలీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు డా. కొండ ఏడుకొండలు, వినోద్, బాలరాజు, పవన్, ఆంజనేయులు పాల్గొన్నారు.


షబ్బీర్ అలీకి వినతి పత్రం అందజేస్తున్న బొల్లెపల్లి స్వామిగౌడ్ తదితరులు

బాధిత కుటుంబానికి తలసాని ఆర్థిక సాయం

మారేడుపల్లి, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యక్రమాల్లో ఎంతో చురుకుగా పాల్గొనే సుజాత మరణం చాలా బాధాకరమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకురాలు సుజాత ఇటీవల మరణించారు. శనివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయంలో సుజాత భర్త రవి కుమార్, ఇద్దరు కుమార్తెలకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు ఉన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వాషింగ్ యార్డు వద్ద ఓ గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం నంబర్ 1 వైపు వాషింగ్ యార్డు సమీపంలో గుర్తుతెలియని 50 ఏళ్ల వ్యక్తి రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించగా ఆత్మహత్య చేసుకున్న ఆనవాళ్లు కనిపించాయని రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఈ ఏడాది చోరీ కేసుల్లో 144 మంది అరెస్టు

● ఆర్పీఎఫ్ సీఐ సరస్వత్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో నేరాలు జరుకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ సీఐ సరస్వత్, సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రైల్వే ఆపరేషన్ సురక్ష యాత్రి చెకింగ్‌లో భాగంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగులు, బంగారు ఆభరణాలు ఇతరత్రా వస్తువులను చోరీ చేసిన 144 మంది నిందితులను అరెస్టు చేసి రూ. 89.06 లక్షల విలువైన సొత్తును రికవరీ చేశామన్నారు. నేరాలు అదుపు చేయడానికి జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ఆపరేషన్ యాత్రి సురక్ష పేరుతో నేరస్తుల్ని పట్టుకుంటున్నామని చెప్పారు.

యువకుడి అదృశ్యం

బౌద్ధనగర్, సెప్టెంబర్21 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి పుట్టిన రోజు పార్టీకని ఇంటి నుంచి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సబితా తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి బీదల బస్తీకి చెందిన ఎం.సూర్యతేజ(19) నగరంలో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నా డు. ఈనెల 3వ తేదీ రాత్రి 11 గంటలకు ఫ్రెండ్ బర్త్‌డే పార్టీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. మరుసటి రోజు మధ్యాహ్నం తల్లి కుమారుడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. సూర్యతేజ నిజామాబాద్ వెళ్లాడని అతని స్నేహితుడు తల్లికి చెప్పాడు. కుమారుడి కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవటంతో సూర్య తేజ తల్లి శ్యామల తన కుమారుడు కనిపించటం లేదంటూ శనివారం చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అదృశ్యమైన సూర్యతేజ

టీటీపై దాడి చేసిన రైల్వే ఉద్యోగి

రైలు కిందపడి బలవన్మరణం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌లో రెండు రోజుల క్రితం రైల్వే టీటీపై దాడి చేసిన రైల్వే ఉద్యోగి మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సంజీవయ్య పార్కు వద్ద ఈ ఘటన జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ చిలకలగూడ రైల్వే క్వార్టర్ ప్రాంతానికి చెందిన బి. నరేష్ (27) రైల్వే ఉద్యోగి. ఏడాది క్రితం సికింద్రాబాద్ నుంచి న్యూఢిల్లీకి వెళ్లే దక్షిణ ఎక్స్‌ప్రెస్ రైలులో ఏసీ బోగిలో ప్రయాణిస్తున్నాడు. ఆ సమయంలో ఏసీ బోగిలో విధులు నిర్వహిస్తున్న టీటీ రమేష్ బాబు టికెట్ చూపించాలని అడిగాడు. నరేష్ తాను స్టాఫ్ (రైల్వే ఉద్యోగి) అని చెప్పగా మీరు ఏసీ బోగిలో కాకుండా స్లీపర్ కోచ్‌కు వెళ్లండి అని టీటీ చెప్పడంతో అతడితో వాగ్వాదానికి దిగారు. ఈ కేసుకు సంబం ధించి ఈనెల 19న సికింద్రాబాద్ రైల్ నిలయంలో చీఫ్ కమర్షియల్ కార్యాలయం లో విజిలెన్స్ విచారణ ఉన్నందున్న టీటీ రమేష్‌బాబు, నరేష్ విచారణకు హాజర య్యారు. విచారణ అనంతరం రమేష్‌బాబు రైల్ నిలయం వెనుక టీచర్స్ కాలనీ మీదుగా బైకుపై వెళ్తుండగా నరేష్ దుడ్డు కర్రతో దాడి చేశాడు. తీవ్రంగా గాయ పడ్డ టీటీ మెట్టుగూడలోని రైల్వే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నరేష్‌పై బా ధితుడు తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి నుంచి దాడికి పాల్పడ్డ నరేష్ కనిపించకుండాపోయాడు. ఈ క్రమంలో శనివారం సికింద్రాబాద్ సంజీవయ్య పార్కు వద్ద గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.


నరేష్ మృతదేహం

రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి హత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురయ్యాడు. సికింద్రాబాద్ రైల్వే ఇన్ స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపిన వివ రాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేష న్ ప్లాట్ ఫారం నంబర్ 10 సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (45) చనిపోయి ఉండగా పెట్రోలింగ్ చేస్తున్న ఆర్పీఎఫ్ కాని స్టేబుల్ లక్ష్మీపతి గమనించాడు. వెంటనే అతడు సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐతో పాటు కానిస్టేబుల్ ఘటనా స్థలా నికి చేరుకున్నారు. మృతదేహంపై గాయాలు ఉన్నట్టు గుర్తించారు. అతడిని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి ఉండవచ్చని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఎవరనేది ఇంకా తెలియరాలేదని రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


హత్యకు గురైన వ్యక్తి మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

జన్యు, పర్యావరణ, జీవనశైలి కారణాలతోనే మతిమరుపు

● టీఎస్‌బీ మెంటల్ హెల్త్ అవేర్నెస్ కమిటీ చైర్మన్ డాక్టర్ జార్జిరెడ్డి


ప్రపంచ మతిమరుపు వ్యాధి దినోత్సవ కరపత్రాన్ని విడుదల చేస్తున్న వైద్యులు

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మతిమరుపు (అల్జీమర్స్) వ్యాధి అనేది ముఖ్యంగా జన్యు, పర్యావరణ, జీవనశైలి కారణాలవల్ల వస్తుందని, దీనివల్ల మెదడు కణజాలాన్ని కోల్పోవడమే కాకుండా కణాల మధ్య పనితీరు కమ్యూనికేషన్ దెబ్బతినేలా చేస్తుందని టీఎస్‌బీ మెంటల్ హెల్త్ అవేర్నెస్ కమిటీ చైర్మన్ డాక్టర్ జార్జిరెడ్డి అన్నారు. శనివారం ప్రపంచ మతిమరుపు దినోత్సవం సందర్భంగా ఎర్రగడ్డలోని మానసిక ఆస్పత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ గణాంకాల ప్రకారం ప్రతి సంవత్సరం మతిమరుపు వ్యాధితో లక్షకు పైగా మరణాలు సంభవిస్తున్నాయన్నారు. మతిమరుపు అసోసియేషన్ ప్రకారం 65 ఏళ్ల అంతకంటే ఎక్కువ వయసు ఉన్న వారిలో అల్జీమర్స్ వ్యాధి మరణానికి ఐదో ప్రధాన కారణమని తెలిపారు. మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.అనిత మాట్లాడుతూ, మతిమరుపు వ్యాధి అనేది మానసిక రోగుల్లోనే కాకుండా సాధారణ వ్యక్తుల్లో కూడా సంభవిస్తుందన్నారు. ఈ మతిమరుపు వ్యాధికి మందులు ఉన్నాయని, వాటికన్నా దైనందిన జీవిత విధానంలో మార్పులు చాలా ఫలితాన్ని ఇస్తాయన్నారు. హైదరాబాద్ సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ గిరిప్రసాద్ మాట్లాడుతూ, మతిమరుపు రాకుండా ఉండడానికి ఎక్కువగా చదవడం అలవాటు చేసుకోవాలన్నారు.మానసిక ఆసుపత్రి సైకాలజీ విభాగం అధిపతి డాక్టర్ సుధా, మెడికల్ సైకాలజిస్టు వెంకటసుబ్బయ్య, వైద్యు సిబ్బంది పాల్గొన్నారు.

ఏడాదైనా దిక్కు, మొక్కు లేదు!

● నందానార్‌నగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ కోసం రోడ్డును తవ్వించిన అధికారులు
● పనులు పూర్తై ఏడాదైనా తిరిగి నిర్మించడంలో నిర్లక్ష్యం
● కంకర తేలిన రోడ్డుపై ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్ర వాహనదారులు

అడ్డగుట్ట, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): అధికారులు.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది...అభివృద్ధి పనులు పేరిట అద్దంలా ఉన్న రోడ్డును తవ్వేసి తర్వాత పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆ మార్గంలో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తోంది. అడ్డగుట్ట డివిజన్ తుకారాంగేట్‌లోని నందానార్‌నగర్ బస్తీలోని రోడ్డు దుస్థితే ఇందుకు నిదర్శనం.

నందానార్ నగర్ బస్తీలోని గణపతి ఆలయం వద్ద ఏడాది క్రితం డ్రైనేజీ పైప్‌లైన్ కోసం రోడ్డును తవ్వారు. పైప్‌లైన్ పనులు పూర్తయిన వెంటనే తిరిగి రోడ్డును వేయాల్సి ఉండగా అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోవడం మానేశారు. దీంతో అస్తవ్యస్తంగా ఉన్న ఆ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంకర తేలిన రోడ్డుపై ప్రయాణిస్తూ ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనం అదుపుతప్పి కిందపడి గాయాల పాలవుతున్నారు. చీకటి పడితే ప్రమాదకరంగా ఉన్న నందానార్‌నగర్ బస్తీ రోడ్డుపై ప్రయాణించేందుకు వణికిపోతున్నారు. రోడ్డు తవ్వి ఏడాదైనా కొత్త రోడ్డు వేయించడంలో స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడంలేదని, వెంటనే రోడ్డు వేయించాలని స్థానికులు కోరుతున్నారు.


నందనార్ నగర్‌లో పైప్‌లైన్ కోసం రోడ్డును తవ్వి కొత్త రోడ్డు వేయకుండా వదిలేసిన దృశ్యం

బడికి వెళ్లేందుకు ఇబ్బందులు

సాయినగర్,ఇందిరాలక్ష్మీనగర్ పరిసర ప్రాంతాలకు చెందిన చిన్నారులు నందానార్‌నగర్ బస్తీలో ఉన్న స్కూళ్లలో చదువుకొనేందుకు వస్తారు. ఇక్కడ కంకర తేలి ఉన్న రోడ్డుపై పాఠశాలలకు నడిచి వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. ఒక్కోసారి కిందపడి గాయాలపాలవుతున్నారు. చిన్నారులను ద్విచక్రవాహనాలపై ఎక్కించుకొని ఉదయంపూట హడావుడిగా స్కూళ్లకు వెళ్లేటపుడు ప్రమాదాలకు గురవుతున్నామని, వెంటనే సీసీ రోడ్డు నిర్మించాలని చిన్నారుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వెంటనే సీసీ రోడ్డు వేయాలి

● శ్రీకాంత్ నాయక్



నందానార్‌నగర్ బస్తీలో ఏడాది క్రితం మంచిగా ఉన్న రోడ్డును డ్రైనేజీ పైప్‌లైన్ కోసమని తవ్వేశారు. పైప్‌లైన్ పనులు పూర్తయి ఏడాదైనా తిరిగి రోడ్డు నిర్మించపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వెంటనే సీసీ రోడ్డు వేసి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరుతున్నా.

ప్రమాదాలు జరుగుతున్నాయి

● మహేష్



డ్రైనేజీ పైప్‌లైన్ కోసం మంచిగా ఉన్న రోడ్డును తవ్వారు. పైప్‌లైన్ పనులు పూర్తి చేసి ఏడాది అవుతున్నా సీసీ రోడ్డు మాత్రం వేయలేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు ప్రారంభించలేదు. దీంతో ఉదయం స్కూళ్ల సమయంలో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవు తున్నారు. సీసీ రోడ్డు వేసి వినియోగంలోకి తీసుకురావాలి.